# విశ్వనాథ్ విశ్వరూపం

*– రాయవరపు సత్యనారాయణ*

తెలుగువారి జీవనశైలిలో తెలుగు సినిమా విడదీయలేని అంతర్భాగం. తెలుగువారి గుండె సవ్వడి తెలుగు సినిమా. తెలుగు చలనచిత్ర చరిత్రలో నాలుగు దశాబ్దాల కాలం – 1950 నుండి 1990 వరకు – ఒక స్వర్ణయుగం. చలనచిత్ర మహా దిగ్దర్శకులు సర్వశ్రీ బి.ఎన్. రెడ్డి, కె.వి. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్, ఆదుర్తి, బాపు, కాశీనాథుని విశ్వనాథ్‌గార్లు సృజించిన ఎన్నో తెలుగు చిత్రాలు తెలుగువారి వారసత్వ సంపదలయ్యాయి. కళాతపస్వి విశ్వనాథ్‌గారి కంఠాభరణం *శంకరాభరణం* ఒక ప్రభంజనం సృష్టించింది. ఒక మహోన్నత మైలురాయి. విశ్వనాథ్‌గారి దర్శకత్వ సినిమాయణం ఒక మహర్దశ.

రచయిత డా. ఎ.ఎస్. రామశాస్త్రిగారు (పెన్ను పేరు 'అనామకుడు') విశ్వనాథ్ గారి సినిమాలను యౌవన దశ నుంచి (1970 నుంచి) నేటివరకు ఐదు దశాబ్దాలపాటు తాదాత్మ్యంతో చూస్తూ తమ జీవన విధానంలో అంతర్భాగంగా మార్చుకున్నారు. వృత్తిరీత్యా డా. రామశాస్త్రిగారు రిజర్వ్ బ్యాంక్ మాజీ ఉన్నతోద్యోగి. మన దేశ వ్యవస్థ యొక్క డిజిటలైజేషన్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటున్న జాతీయస్థాయి నిపుణులు; బ్యాంకింగ్, ఐటీ కంపెనీల బోర్డు సభ్యులు. ప్రవృత్తిరీత్యా సహజ కవి, కథ, నవలల రచయిత.

విశ్వనాథ గారి దర్శకత్వ ప్రస్థానాన్ని కూలంకషంగా పరిశీలించి, పరవశించగా వెల్లువెత్తిన భావప్రవంతిని డా. రామశాస్త్రిగారు గ్రంథస్థం చేయాలని సంకల్పించారు. ఆ ఉన్నతాశయ పరిణామమే *విశ్వనాథ్ విశ్వరూపం* అనే పుస్తకం. విశ్వనాథ్‌గారి పరాకాష్ట సృష్టి *శంకరాభరణం,* ఆలంబనగా తీసుకొని, ముందు ఐదు చిత్రాలను, తర్వాత ఐదు చిత్రాలను – వెరసి 11 చిత్రాలను ఎంపిక చేసుకొని వాటి విశిష్టతలను సునిశిత విశ్లేషణ చేశారు. మనకి సుపరిచితమైన పాత్రికేయుల సమీక్షలకు భిన్నంగా రూపకల్పన చేశారు (విశ్వనాథ్ గారు 40 తెలుగు, 10 హిందీ చిత్రాలకు దర్శకత్వం చేశారు).

ఈ పుస్తకం 8 అధ్యాయాలుగా విభజించబడింది. వాటి గురించి, దృష్టి సారించిన ప్రధాన విషయాలు క్లుప్తంగా: (1) 'ప్రవేశిక', (2) విశ్వనాథ్ వారి చిత్రాల 'పది ప్రత్యేకతలు', (3) 'శంకరాభరణం' – విస్తృత పరిశీలన, (4) 'అటు ఇటు' – అయిదేసి చిత్రాలు – (అవి: చెల్లెలు కాపురం (71), కాలం మారింది (72), నేరము–శిక్ష (73), సిరిసిరిమువ్వ (76), *శంకరాభరణం* (80), సప్తపది (81), శుభలేఖ (82), స్వాతిముత్యం (85), సిరివెన్నెల (86), స్వాతికిరణం (92) – (5) 'పది చిత్రాలు – పది పాటలు', (6) ఈ చిత్రాల 'మరపురాని సన్నివేశాలు', (7) 'సహకళాకారులు' – ఈ చిత్రాల పాటలు, మాటల రచయితలు, సంగీత దర్శకులు మొదలగు సహకళాకారుల పాత్ర, (8) 'అందానికి అందాలు' – పది చిత్రాల కథానాయికల రూపలావణ్యాలు, నటనా వైభవాల గురించి. అనుబంధంగా విశ్వనాథ్‌వారి సినీప్రస్థాన వివరణ పట్టికలు.

ఈ పుస్తక పరిధిని గురించి రచయిత "... ఈ పుస్తకం విశ్వనాథ గారి బయోగ్రఫీ కాదు. విశ్వనాథవారి చిత్రాలన్నింటికీ భాష్యం రాయడం సులభం కాదు. అది నా అభిమతం కాదు. ఆయన చిత్రాల ఉద్యానవనంలో విహరిస్తూ, నా మనస్సుకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, ఆర్ద్రతను ఇచ్చిన కొన్ని పువ్వులను కోసుకొని ఆయనకు సమర్పించుకొంటున్న మాల ఇది.." అని విశదపరిచారు. ఈ పుస్తకం మొదటి పేజీలు మనను ఆసాంతం చదివిస్తాయి. పుస్తక అత్యంత సరళశైలి, సార్వజనీనత విషయ వివరణలోని తార్కిక నిబద్ధత పాఠకులను ఆకట్టుకొంటాయి. చదువుతున్నప్పుడు ఈ చిత్రాలను తిరిగి చూస్తున్న అనుభూతి కలగడమే కాకుండా, మన మనసుల్లో అంతర్లీనంగా నిక్షిప్తమైన ఎన్నో ప్రత్యేక అనుభవాలు తిరిగి పలకరిస్తాయి. ఈ రచన అనాలోచితంగా ఒక 'సిద్ధాంత వ్యాస' రూపాంతరం పొందడం వారి వృత్తి ధర్మం ప్రభావమని నా అభిప్రాయం. ఈ పుస్తకంలో మనస్సును

హత్తుకొనే విషయాలు కొల్లలు. నేను మెచ్చిన రెండు మచ్చుతునకలను సూక్ష్మంగా ఉదహరిస్తాను.


ఒకటి: సిరిసిరిమువ్వ పాట – ఝుమ్మంది నాదం.

''వేటూరి పద ప్రయోగం ఎంత లలితం, కె.వి. (మామ) వరుసలు ఎంత శ్రావ్యం, సుశీల గానమెంత మధురం, జయప్రద కదలికలెంత సుందరం... ఈ పాట చూస్తుంటే సాహిత్య, సంగీత, నాట్యాల హరివిల్లు ప్రేక్షకుల ముందు ఆవిష్కరిస్తుంది" అన్నారు.

రెండు: విశ్వనాథవారి చిత్రాలు నవరసభరితాలు. ముఖ్యంగా సభ్యశృంగార రస చిత్రీకరణ. స్వాతిముత్యం లోని "మనసు పలికే మౌన గీతం నీవే... మమతలోలికే స్వాతిముత్యం నీవే..." అన్న పాటపై రచయిత వ్యాఖ్య– ''దాంపత్య జీవితం అంటే తెలియని శివయ్యకు (కమలహాసన్) లలితే (రాధిక) నేర్పుకోవలసి వస్తుంది. భార్య భర్తకి సంసార నేర్పించే సన్నివేశాన్ని ఎంతో మృదువుగా, సున్నితంగా, సుమధురంగా, సహజంగా చిత్రీకరించారు విశ్వనాథ్.'' రచయిత విశ్వనాథ్‌గారి అనుపమాన చిత్రీకరణ విధానాన్ని, వారు పాటించిన విలువను నిరూపించారు. మరొక్క విషయం ఏమిటంటే, ఈ పుస్తకం పూర్తిగా చదివినప్పుడు శ్రీ విశ్వనాథ్‌గారు అపురూప లక్షణాలయిన నిష్ఠాపూర్వక కార్యదక్షత, నమ్మిన ఆశయాల ఆచరణ, అకుంఠిత సాధనాలతో మన ముందు ఒక మహర్షిగా సాక్షాత్కరిస్తారు. ఈ పుస్తకం గురించి మన తెలుగు చలనచిత్ర దిగ్గజాలు ముగ్గురు వెలిబుచ్చిన అభిప్రాయాలు మరో విశేషణం. వాటి క్లుప్త వివరాలు– విశ్వనాథ్‌గారు రచయితకు తమ ఆశీస్సులనందిస్తూ "ఇది అంత తేలికైన రచన కాదు. ఏ రామాయణానికో అంతరార్థ రామాయణం రాసినంత కష్టతరమైనది. ఈ రచనలో మీరు కృతకృతులయ్యారని భావిస్తున్నాను'' అని ప్రశంసించారు. కవి, సహజ నటులు తనికెళ్ల భరణిగారు ఈ పుస్తకాన్ని 'విశ్వవీణకు విశిష్ట తంత్రి'గా అభివర్ణిస్తూ ''... ఒక విధంగా ఇది విశ్వనాథ్ – కాళిదాసుకి అనామకుడు – మల్లినాథసూరి వ్యాఖ్య" అన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు తమ తొలి పలుకులో *విశ్వనాథ్ విశ్వరూపం* యొక్క ఆధ్యాత్మిక కోణాన్ని వివరిస్తూ ''విశ్వనాథ్‌గారి నిర్దేశకత్వంలో, దార్శనికతలో సాకారమైన భావాలను అంతశ్చక్షువులతో చూడగలగాలి, ఆత్మసాక్షిగా దర్శించగలగాలి, మనస్సుతో అనుభూతి చెందాలి. అలా చేసి శ్రీ రామశాస్త్రిగారు (సనామకులు) శ్రీ విశ్వనాథ్‌గారి తపస్సుని, ఆ తపఃఫలాన్ని తెలుగు ప్రజలకు, చలనచిత్ర వీక్షకులకు సముచితంగా అందించగలిగారు" అని కొనియాడారు. నా దృష్టిలో ఇది ఒక పాఠ్యపుస్తకం. రెండు తెలుగు రాష్ట్రాల విద్యాశాఖాధికారులు స్వయంప్రతిపత్తిగల కళాశాలలు, విశ్వవిద్యాలయాలు డిగ్రీ/పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు నాన్‌డీటైల్డ్ టెక్స్ట్‌గా నిర్దేశించే అవసరం ఉంది. దీనివలన రెండు ప్రయోజనాలు –

1. నేటి యువతపై దేశవిదేశీ చిత్రాల ప్రభావం ఎక్కువగా ఉండటం దృష్ట్యా ఈ పుస్తకం ద్వారా మన తెలుగు చిత్రాల విశిష్టత, ప్రాధాన్యతల గురించి అవగాహన పెంచుతుంది.

2. ఇది ఒక పరిశోధనా గ్రంథంగా రూపొందింది. పరిశోధనా విషయాలను ఏ విధంగా విశ్లేషించాలి, ఏ విధంగా సులభ గ్రాహ్య రీతిలో వ్యక్తీకరించాలన్న అంశాలపై దోహదకారిగా ఉంటుంది. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లకు, యువ దర్శకులకు ఇది అవసర పాఠ్యగ్రంథం. ఈ పుస్తకాన్ని ఆకట్టుకొనే ముఖచిత్రంతో (కళాకారిణి – రచయిత అపరాజిత), సందర్భోచిత చలనచిత్ర ఫోటోలతో ఉన్నత ముద్రణా, ప్రమాణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.




***

**విశ్వనాథ్ విశ్వరూపం**

*– అనామకుడు (డా. ఎ.ఎస్. రామశాస్త్రి),*

*పేజీలు: 214, రూ. 1000/–*

*ప్రతులకు: అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు,*

*ఫోన్: 800 859 9901.*

***

రాయవరపు సత్యనారాయణ
ముంబయి. ఫోన్: 884 236 9497, 939 142 9717.